


## 5 వ మాట

**జీవజలము అయిన యేసయ్య నామమునకు మహిమ కలుగును గాక!**

**మూలవాక్యము:-** యోహాను19: 28 అటు తరువాత సమస్తమును అప్పటికి సమాప్తమైనదని యేసు ఎరిగి లేఖనము నెరవేరునట్లు నేను దప్పిగొనుచున్నాననెను.

**ప్రవచనము:** కీర్తన69:21 వారు చేదును నాకు ఆహారముగా పెట్టిరి నాకు దప్పియైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి.

**యేసయ్య సిలువలో పలికిన 5వ మాటను మనం ధ్యానము చేస్తున్నాము. ఇది దావీదు ప్రవక్త ప్రవచించిన ప్రవచనము యొక్క నెరవేర్పుగా ఉన్నది. యేసుక్రీస్తు జీవజలములు ఇచ్చువాడు అని వాక్యము తెలియజేస్తుంది. ఆయన శరీరధారిగా సువార్త ప్రకటిస్తున్న దినాలలో**

- **సమరయ స్త్రీతో నేను నీకు జీవజలమును ఇస్తానని చెప్పినట్లుగా వాక్యములో చూస్తున్నాం:**

యోహాను 4:10 :- అందుకు యేసు నీవు దేవుని వరమును నాకు దాహమునకిమ్మని నిన్ను అడుగుచున్నవాడెవడో అదియు ఎరిగియుంటే నీవు ఆయనను అడుగుదువు ఆయన నీకు జీవజలమిచ్చునని ఆమెతో చెప్పెను.

యోహాను 4:14 నేనిచ్చు నీళ్లు త్రాగు వాడెప్పుడును దప్పిగొనడు; నేను వానికిచ్చు నీళ్లు నిత్యజీవమునకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను.

- **లేహీలో ఉన్న గోతిని చీల్చి సంసోను దాహం తీర్చిన వారు యేసయ్య:**

న్యాయా 15:19 దేవుడు లేహీలోనున్న ఒక గోతిని చీల్చెను, దాని నుండి నీళ్లు బయలుదేరెను. అతడు త్రాగిన తరువాత ప్రాణము తెప్పరిల్లి బ్రదికెను. కాబట్టి దాని పేరు నేటివరకు ఏన్హక్కోరె అనబడెను; అది లేహీలో నున్నది.

- **అరణ్యములో బండను చీల్చి ఇశ్రాయేలీయుల దాహము తీర్చినవారు యేసయ్య:**

1 కొరింథీ 10:4 అందరు ఆత్మ సంబంధమైన ఒకే పానీయమును పానము చేసిరి. ఏలయనగా తమ్మును వెంబడించిన ఆత్మసంబంధమైన బండలోనిది త్రాగిరి; ఆ బండ క్రీస్తే.

**లక్షలాది మంది దాహము తీర్చిన యేసయ్య, ఎప్పటికి దప్పిగొనకుండా నిత్యజీవమునకై జీవజలములు ఇచ్చెదనని చెప్పిన యేసయ్య ఇప్పుడు సిలువలో దప్పిగొను చున్నారు....!**

**యేసుక్రీస్తుకు రెండు రకాలైన దప్పిక ఉంది.**

1. **శారీరక దప్పిక**
2. **ఆత్మ సంబంధమైన దప్పిక.**

**మొదటిగా యేసయ్య శారీరక దప్పికకు గల కారణములు ఏమిటో వాక్యములో ధ్యానము చేద్దాం!**

**I. ఆయన దేహము నుండి చెమట రక్తముగా బయటికి రావడము మొదటి కారణము:** లూకా 22:44 అప్పుడు పరలోకమునుండి యొకదూత ఆయనకు కనబడి ఆయనను బలపరచెను. ఆయన వేదనపడి మరింత ఆతురముగా ప్రార్థన చేయగా ఆయన చెమట, నేల పడుచున్న గొప్ప రక్త బిందువులవలె ఆయెను.

**దేహములో ఉన్న నీరంతా చెమట రూపములో బయటికి వచ్చింది. సాధారణముగానే శరీరంలో ఉండవలసిన నీటి శాతం తగ్గిపోతే దప్పిగొనడము జరుగుతుంది. యేసుక్రీస్తు సిలువపైన లోకపాపముల నిమిత్తము ప్రాయశ్చిత్తము చేస్తూ గొర్రెపిల్లగా వధియింప బడుచున్నారు. యేసయ్య పరిపూర్ణ మానవునిగా సిలువ యాగము చేస్తున్నారు. ఆయన జీవితాన్ని గమనిస్తే మనుష్యులందరి వలె ఆకలి గొన్నారు(మత్తయి21:18), దప్పిగొన్నారు(యోహాను4:7), అలసిపోయారు(యోహాను4:6), నిద్రపోయారు(లూకా8:23), న్యాయముగా కోపపడ్డారు(యోహాను22:14-16), కన్నీరు విడిచారు(యోహాను11:35), ప్రార్థన చేశారు(మార్కు6:46). ఇవన్ని యేసయ్య పరిపూర్ణ మానవుడు అని తెలియజేస్తున్నాయి.**

**II. ఒలీవల కొండ నుండి కల్వరి వరకు ఆయన చేసిన 7 ప్రయాణములు రెండవ కారణము:**

**తెల్లవారుటకు ముందు:**

1. **మొదటి ప్రయాణము: ఒలీవల కొండ నుండి - ప్రధాన యాజకునికి మామయైన అన్న యొద్దకు:** యోహాను 18:12 అంతట సైనికులును సహస్రాధిపతియు, యూదుల బంట్రౌతులును యేసును పట్టుకొని ఆయనను బంధించి, మొదట అన్న యొద్దకు ఆయనను తీసికొనిపోయిరి.
2. **రెండవ ప్రయాణము: ప్రధాన యాజకునికి మామయైన అన్న యొద్ద నుండి - ప్రధాన యాజకుడైన కయప యొద్దకు:** యోహాను 18:24 అంతట అన్న, యేసును బంధింపబడియున్నట్టుగానే ప్రధానయాజకుడైన కయప యొద్దకు పంపెను.
3. **మూడవ ప్రయాణము: కయప యొద్ద నుండి – అధికార మందిరమునకు:** యోహాను 18:28 వారు కయప యొద్దనుండి అధికారమందిరమునకు యేసును తీసికొనిపోయిరి అప్పుడు ఉదయమాయెను గనుక వారు మైలపడకుండ పస్కాను భుజింపవలెనని అధికారమందిరములోనికి వెళ్లలేదు.

**తెల్లవారిన తర్వాత:**

4. **నాలుగవ ప్రయాణము: అధికార మందిరము నుండి – పిలాతునొద్దకు:** మార్కు 15:1 ఉదయము కాగానే ప్రధానయాజకులును పెద్దలును శాస్త్రులును మహాసభవారందరును కలిసి ఆలోచన చేసి యేసును బంధించి తీసికొనిపోయి పిలాతునకు అప్పగించిరి.
5. **ఐదవ ప్రయాణము: పిలాతు యొద్ద నుండి – హేరోదు నొద్దకు:** లూకా 23:6,7 పిలాతు ఈ మాట వినిఈ మనుష్యుడు గలిలయుడా అని అడిగి, ఆయన హేరోదు అధికారము క్రింద ఉన్న ప్రదేశపు వాడని తెలిసికొని హేరోదునొద్దకు ఆయనను పంపెను. హేరోదు ఆ దినములలో యెరూషలేములో ఉండెను.




6. **ఆరవ ప్రయాణము: హేరోదు యొద్ద నుండి – పిలాతు నొద్దకు:** లూకా 23:33 హేరోదు తన సైనికులతో కలిసి, ఆయనను తృణీకరించి అపహసించి, ఆయనకు ప్రశస్తమైన వస్త్రము తొడిగించి పిలాతు నొద్దకు మరల పంపెను.

7. **ఏడవ ప్రయాణము: పిలాతు యొద్ద నుండి – గొల్గొతా (కల్వరి) వరకు:** లూకా 23:33 వారు కపాలమనబడిన స్థలమునకు వచ్చినప్పుడు అక్కడ కుడివైపున ఒకనిని ఎడమవైపున ఒకనిని ఆ నేరస్థులను ఆయనతో కూడ సిలువవేసిరి.

**సర్వసాధారణముగా ప్రయాణము చేస్తే ఏ మనుష్యుడైనా దప్పిగొంటాడు. అదియుగాక మండుటెండలో యేసయ్య సిలువ వేయబడ్డారు. యేసయ్య సువార్త ప్రయాణములో సమరయ గుండా వెళ్లినప్పుడు దప్పిగొన్నారు. తెల్లవారుజాము నుండి దాదాపుగా మధ్యాహ్నము వరకు ఆయన చేసిన 7 ప్రయాణములు ఆయన దప్పిగొనటానికి గల మరొక కారణముగా మనం అర్థం చేసుకోవాలి. పై కారణాల వల్ల ఆయన శరీరరీతిగా దప్పిగొన్నారు.**

- **మరి యేసయ్య శారీరక దప్పిక తీర్చబడిందా...?**

**యేసయ్య దాహం తీర్చడానికి బోళము కలిపిన ద్రాక్షారసము సైనికులు ఆయనకు ఇచ్చారు. యేసయ్య ఆ చిరక పుచ్చుకున్నాడు అని యోహాను సువార్తలో వ్రాయబడియుంది. యోహాను 19:30 యేసు ఆ చిరక పుచ్చుకొని సమాప్తమైనదని చెప్పి తల వంచి ఆత్మను అప్పగించెను. అయితే మార్కు సువార్తలో గమనిస్తే ఆయన చిరక పుచ్చుకొనలేదు అని వ్రాయబడియుంది. మార్కు 15:23 అంతట బోళము కలిపిన ద్రాక్షారసము ఆయనకిచ్చిరి గాని ఆయన దాని పుచ్చు కొనలేదు.**

- **పై రెండు మాటలు ఒకదానికొకటి వ్యతిరేఖంగా ఉన్నాయి !**

**ఇంతకు యేసయ్య  ఆ చిరకను పుచ్చుకున్నారా? లేదా అనేది స్పష్టం గా తెలియాలంటే, మనము మత్తయి సువార్తలో వ్రాయబడిన మాటను చదువుదాం. మత్తయి 27:34 చేదు కలిపిన ద్రాక్షారసమును ఆయనకు త్రాగనిచ్చిరి గాని ఆయన దానిని రుచి చూచి త్రాగనొల్లకపోయెను.**

**ఆయన రుచి చూచారు – యోహాను దానిని "పుచ్చుకుని" అని వ్రాశాడు**
**ఆయన దానిని త్రాగనొల్లక పోయెను – మార్కు దానిని "పుచ్చుకొనలేదు" అని వ్రాశాడు.**

**అయితే ఆయన రుచి చూచి త్రాగనొల్లక పోయారు అని మనకు అర్థమౌతుంది. గనుక ఆయన శారీరక దాహం తీర్చబడలేదు.**

**మరి యేసయ్య ఆత్మీయ దప్పిక ఏమిటి?  యేసయ్య దాహమునకు నీళ్లిమ్మని సమరయ స్త్రీని అడుగుతున్నారు.** యోహాను 4:7 సమరయ స్త్రీ ఒకతె నీళ్ళు చేదుకొనుటకు అక్కడికి రాగా యేసు నాకు దాహమునకిమ్మని ఆమె నడిగెను.




**ఆ స్త్రీ త్రాగడానికి నీళ్లివ్వలేదు మరి ఆ స్త్రీ ఎలా ఆయన దాహం తీర్చింది???**

**యోహాను 4:28,29, 40- 42:-** ఆ స్త్రీ తన కుండ విడిచిపెట్టి ఊరిలోనికి వెళ్లి. మీరు వచ్చి, నేను చేసినవన్నియు నాతో చెప్పిన మనుష్యుని చూడుడి; ఈయన క్రీస్తుకాడా అని ఆ ఊరివారితో చెప్పగా. ఆ సమరయులు ఆయనయొద్దకు వచ్చి తమయొద్ద ఉండుమని ఆయనను వేడుకొనిరి గనుక ఆయన అక్కడ రెండు దినములుండెను. ఆయన మాటలు వినినందున ఇంకను అనేకులు నమ్మి ఆ స్త్రీని చూచి ఇకమీదట నీవు చెప్పిన మాటనుబట్టి కాక, మామట్టుకు మేము విని, యీయన నిజముగా లోకరక్షకుడని తెలిసికొని నమ్ముచున్నామనిరి.

**ఈ స్త్రీ యేసయ్య దాహము తీర్చడానికి నీళ్లివ్వలేదు గాని యేసయ్య చెప్పిన సువార్తను నమ్మింది. ఆ సువార్తను తన గ్రామములో ప్రకటించి, గ్రామమంతటిని యేసయ్య యొద్దకు నడిపించి, లోకరక్షకున్ని చూపించడం ద్వారా ఆయన దాహం తీర్చింది. మరి నీవు, నేను యేసయ్య దాహం తీర్చుచున్నామా?లేక చేదు చిరక నిచ్చుచున్నామా? యేసయ్య కు నశించిపోతున్న ప్రతి ఆత్మ రక్షించబడవలెనన్న దాహం ఉంది. నీవు నేను యేసయ్య దాహం తీర్చాలంటే ఆ సమరయ స్త్రీ వలె మనము కూడా సువార్త ప్రకటించాలి. మారుమూల గ్రామాలకు, పల్లెలకు, పట్టణాలకు వెళ్లి సువార్త ప్రకటించి నశించిపోతున్న ఆత్మలను యేసయ్య చెంతకు నడిపించాలి. అప్పుడే ఆయన దాహము తీర్చగలము. అలా చేయకపోతే రోమా సైనికుల వలె ఆయన దప్పిక తీర్చడానికి చేదు చిరకను ఇచ్చిన వారమౌతాము. యేసయ్య దాహము తీర్చవలెనన్న దాహము ప్రతి క్రైస్తవుడు, క్రైస్తవ సేవకుడు కలిగి యుండాలి.**

**ప్రియ విశ్వాసి, ప్రియ సేవకుడా.... నీవు ఏ దాహం కలిగి ఉన్నావు?**

**ఆత్మల కొరకైన దాహమా? లేక..... ధనం కొరకైన దాహమా, పేరు ప్రఖ్యాతుల కొరకైన దాహమా? అధికారం కొరకైన దాహమా? వ్యభిచారం కొరకైన దాహమా?**

*నీ దాహం ఏంటి?...............*

**కీర్తన 42:1,2** దుప్పి నీటివాగుల కొరకు ఆశపడునట్లు దేవా, నీకొరకు నా ప్రాణము ఆశపడుచున్నది. నా ప్రాణము దేవునికొరకు తృష్ణగొనుచున్నది జీవము గల దేవునికొరకు తృష్ణగొనుచున్నది దేవుని సన్నిధికి నేనేప్పుడు వచ్చెదను? ఆయన సన్నిధిని నేనెప్పుడు కనబడెదను?

**యెషయా 55:1 – దప్పిగొనిన వారలారా, నీళ్లయొద్దకు రండి, మీరు వచ్చి కొని భోజనము చేయుడి. రండి, రూకలు లేకపోయినను ఏమియు నియ్యకయే ద్రాక్షారసమును పాలను కొనుడి.**

**ఈ మాటలో యేసయ్య దప్పిక, ప్రవచన నెరవేర్పు ఉన్నట్లుగా చూడగలము. దేవుకి కొరకైన దాహం, యేసయ్య దాహము తీర్చవలెనన్న దాహము పరిశుద్ధాత్మ దేవుడు మనందరిలో కలిగించును గాక...ఆమేన్...ఆమేన్...ఆమేన్...**